
www.kalamdaily.com

# కలం

ప్రజల గళం...

16-02-2026, సోమవారం

Follow on: Kalamtelugu








నిన్న మొన్నటి వరకు బస్తీల్లో 'నువ్వెంత.. నువ్వెంత..' అంటూ జబ్బలు, తొడలు చరుచుకున్నారు పార్టీల లీడర్లు. వీర విజృంభణ చేశారు కార్యకర్తలు. ఇప్పుడు మున్సిపాలిటీల చైర్‌పర్సన్, కార్పొరేషన్‌ల మేయర్ పోస్టుల కోసం ఒక్కటైపోయారు! పీఠం కోసం రాజకీయ ప్రత్యర్థులు అలయ్ బలయ్ చేసుకున్నారు. హంగ్‌ల అడ్డాల్లో హగ్గులు ఇచ్చుకున్నారు. ప్రత్యర్థికి కుర్చీ దక్కకుండా.. పావులు కదిపారు. ఎత్తుకు పైఎత్తులు వేశారు. కొన్ని చోట్ల కాంగ్రెస్, బీఆర్ఎస్ దోస్తీ.. ఇంకొన్ని చోట్ల బీజేపీ, బీఆర్ఎస్ ద్యూయెట్లు.. కొన్నిచోట్ల స్ట్రీట్ ఫైట్.. ఇంకొన్ని చోట్ల లబోదిబోమంటూ రాజీనామాలు... ఓటేసిన ప్రజలు మాత్రం ముక్కున వేలేసుకున్నారు.

మున్సిపాలిటీలు, కార్పొరేషన్ పీఠాల కోసం సోమవారం అనేకచోట్ల హైడ్రామా నడిచింది.. హైటెన్షన్ నెలకొన్నది.. 'హంగ్' ఉన్నచోట 'కింగ్' కోసం పార్టీలు విశ్వప్రయత్నాలు చేశాయి. పోలింగ్ తర్వాత మొదలైన క్యాంపు రాజకీయాలు పాలకవర్గాల కొలువుదీరే వరకూ ఐదు రోజుల పాటు కొనసాగాయి. క్షణ క్షణం టెన్షన్ టెన్షన్.. ఏ విన్నర్ ఎటు జంప్ అవుతారోననే సస్పెన్స్.. పాలకవర్గం ఎన్నికలో చెయ్యెత్తేది ఎవరు, చెయ్యిచ్చేది ఎవరు అనే డిస్కషన్స్.. 'హంగ్' మున్సిపాలిటీల్లో హాట్ సీన్... చివరికి పాలకవర్గాలు కొలువుదీరాయి. సరికొత్త 'పొత్తు'పొడుపులు పొడిచాయి. కొన్ని వాయిదా పడ్డాయి.

సిద్ధాంతాల్లేవ్.. విలువల్లేవ్.. పార్టీల తేడాల్లేవ్.. నైతికత అసలే లేదు. అంతా పవర్ పాలిటిక్స్. కుర్చీకోసం కుమ్మక్కు రాజకీయాలు.

- తెలంగాణ బ్యూరో, కలం



# కుర్చీల కోసం కిష్కింధకాండ

## మేయర్, చైర్‌పర్సన్ ఎన్నికల్లో విలువలు పతనం

**హంగ్ అడ్డాల్లో ప్రత్యర్థుల హగ్గింగ్, అలయ్ బలయ్**

**కొన్నిచోట్ల కాంగ్రెస్, బీఆర్ఎస్.. ఇంకొన్ని చోట్ల బీజేపీ, బీఆర్ఎస్ దోస్తీ**

## 'బండి' బాటలో కరీంనగర్

**నెగ్గిన కేంద్ర మంత్రి పంతం.. తగ్గిన సీఎం వర్గం**

కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ చరిత్రలోనే ఫస్ట్ టైమ్ బీజేపీ మేయర్ కొలువుదీరారు. చివరివరకూ 'నువ్వా.. నేనా..' అనే తీరులో బీజేపీ, కాంగ్రెస్ మధ్య హైడ్రామా నడిచింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కేంద్రమంత్రి బండి సంజయ్ ఈ ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. మేయర్ పీఠం మాదేనంటూ బండి సంజయ్, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ సవాళ్లు విసురుకున్నారు. చివరకు 'బండి'దే పైచేయి అయింది. బీఆర్ఎస్‌కు చెందిన తొమ్మిది మంది 'కింగ్ మేకర్' కార్పొరేటర్లు ఓటింగ్‌కు దూరంగా ఉండి ఈ సస్పెన్స్ కు ముగింపు పలికారు. సింగిల్ లార్జెస్ట్ పార్టీగా ఉన్న బీజేపీ కార్పొరేటర్ మేయర్ అయ్యారు. పరోక్షంగా బీజేపీకి మద్దతు పలికిందన్న అపవాదును బీఆర్ఎస్ మూటగట్టుకున్నది. మ్యాజిక్ ఫిగరే లేకుండా మేయర్ కావాలనుకున్న కాంగ్రెస్ ప్లాన్ బెడిసికొట్టింది. మేయర్ (కొలగాని శ్రీనివాస్), డిప్యూటీ మేయర్ (సునీల్‌రావ్).. రెండూ బీజేపీ వశమయ్యాయి. కార్పొరేషన్ లో మొత్తం సీట్లు 66. ఎన్నికల్లో బీజేపీకి 30, కాంగ్రెస్ 14, ఎంఐఎం 3, బీఆర్ఎస్ 9, ఇతరులు 10 గెలుచుకున్నారు.

**కాంగ్రెస్ గేమ్‌కు ఫినిషింగ్ టచ్ ఇస్తా: సంజయ్**

"మున్సిపల్ ఎన్నికల కబడ్డీ ఆటలో బీజేపీ 'కప్' గెల్చుకున్నది. అనవసరంగా నన్ను రెచ్చగొట్టారు.. ఆట మొదలుపెట్టారు.. ఇక నేను ఫినిషింగ్ టచ్ ఇస్తా" అని సీఎం రేవంత్‌కు బండి సంజయ్ అల్టిమేటం ఇచ్చారు. 20 ఏండ్ల కింద 2005లో ఇదే రోజున కార్పొరేటర్‌గా ఫస్ట్ టైమ్ గెలిచినప్పటికంటే మేయర్ పీఠాన్ని బీజేపీ దక్కించుకున్నందుకు ఇప్పుడే ఎక్కువ సంతోషపడుతున్నానని చెప్పారు. అవినీతికి ఆస్కారం లేకుండా కరీంనగర్ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. "ఎన్నికల వరకే పాలిటిక్స్... ఎన్నికల తర్వాత డెవలప్‌మెంటే.. అన్ని పార్టీలూ కలిసి రావాలి.. ప్రతిపక్ష మేయర్ అనే భావనతో రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇవ్వకుంటే నిలదీస్తాం" అని సంజయ్ హెచ్చరించారు.

## ఇందూరులో మిలాఖత్

**దోస్తీ కట్టిన కాంగ్రెస్, ఎంఐఎం, బీఆర్ఎస్ కార్పొరేటర్లు**

**కాంగ్రెస్ ఖాతాలో మేయర్ సీటు.. ఎంఐఎంకు డిప్యూటీ మేయర్**

నిజామాబాద్ కార్పొరేషన్‌ను కాంగ్రెస్ దక్కించుకున్నది. మేయర్‌గా 49వ డివిజన్ కార్పొరేటర్ కూరగాయల ఉమారాణిని ఆ పార్టీ అధిష్ఠానం ఎంపిక చేసింది. ఎంఐఎం తరఫున 54వ డివిజన్ నుంచి గెలిచిన సల్మా తహసీన్ డిప్యూటీ మేయర్ అయ్యారు. బీఆర్ఎస్ ఏకైక కార్పొరేటర్ విజయలక్ష్మి ఓటుతో పాటు ఎంఐఎం 14 మంది ఓట్లు, 2 ఎక్స్ అఫీషియో ఓట్లతో కాంగ్రెస్ పార్టీ మ్యాజిక్ ఫిగర్ దాటేసి కార్పొరేషన్‌ను కైవసం చేసుకున్నది. నిజామాబాద్ లో మొత్తం 60 డివిజన్లు. బీజేపీకి 28, కాంగ్రెస్‌కు 17, ఎంఐఎంకు 14, బీఆర్ఎస్‌కు 1 సీటు వచ్చింది. మేయర్ పదవి దక్కాలంటే మ్యాజిక్ ఫిగర్ 31. క్యాంపులో ఉన్న కాంగ్రెస్, ఎంఐఎం, బీఆర్ఎస్ కార్పొరేటర్లు (17+14+1)చేతులు కలిపారు. ఎక్స్ అఫీషియో సభ్యులు ఎమ్మెల్సీ మహేశ్ గౌడ్, ఎమ్మెల్యే భూపతిరెడ్డితో కలుపుకుని కాంగ్రెస్ బలం 34కు చేరింది. కాంగ్రెస్ మేయర్ అభ్యర్థి ఉమారాణికి కాంగ్రెస్, ఎంఐఎం, బీఆర్ఎస్ కార్పొరేటర్లు మద్దతు పలికారు. దీంతో ఉమారాణి మేయర్‌గా, సల్మా తహసీన్ డిప్యూటీ మేయర్ ఎన్నికయ్యారు. బీజేపీకి వచ్చిన 28 సీట్లతో పాటు ఎంపీ ధర్మపురి అర్వింద్, ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ, రాకేశ్ రెడ్డితో కలిపి 31 ఓట్లు ఉన్నా కార్పొరేషన్‌ను దక్కించుకోలేదు. ఇతరులతో తాము కలిసే ప్రసక్తి లేదని మొదటి నుంచి బీజేపీ చెప్తున్నది. 2020 ఎన్నికల్లో కూడా ఇప్పటిలాగే అతిపెద్ద పార్టీగా అవతరించినప్పటికీ బీజేపీ.. పీఠాన్ని చేజార్చుకుంది.



## కొత్తగూడెంలో ఎర్ర జెండా

**చేయికలిపిన సీపీఐ, కాంగ్రెస్.. మేయర్, డిప్యూటీ పీఠాలు ఫిఫ్టీ ఫిఫ్టీ**

తొలిసారి ఏర్పాటైన కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ పీఠాన్ని సీపీఐ దక్కించుకుంది. సుజాతనగర్ 20వ డివిజన్ సీపీఐ కార్పొరేటర్ మూడ్ గణేష్ మేయర్ గా ఎన్నికయ్యారు. డిప్యూటీ మేయర్ కుర్చీని పాల్వంచ 8వ డివిజన్ కాంగ్రెస్ కార్పొరేటర్ సిరిపురపు లలితా కుమారిని వరించింది. మున్సిపల్ ఫలితాల్లో కార్పొరేషన్ లో మొత్తం 60 డివిజన్లకుగాను కాంగ్రెస్ (22), సీపీఐ(22), బీఆర్ఎస్ (8), బీజేపీ(1), సీపీఎం(1), ఇండిపెండెంట్లు(6) గెలుపొందాయి. మేయర్ పీఠాన్ని దక్కించుకునేందుకు మ్యాజిక్ ఫిగర్ 31. ఏ పార్టీకీ పూర్తి మెజార్టీ రాకపోవడంతో హంగ్ ఏర్పడింది. సీపీఐ, కాంగ్రెస్ సమానంగా సీట్లు రావడంతో పొత్తులు కీలకంగా మారాయి. అనూహ్యంగా బీఆర్ఎస్ నేత కేటీఆర్ సీపీఐకి తమ మద్దతు ప్రకటించారు. కాంగ్రెస్ కు మేయర్ పీఠం దక్కకుండా చేసేందుకు ఓపెన్ ఆఫర్ ఇచ్చారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ కు సీపీఐ మద్దతు ఇచ్చినందున.. ఇక్కడ కూడా ఈ రెండు పార్టీలు చేయికలిపాయి. కేటీఆర్ ఓపెన్ ఆఫర్ కు చెక్ పెట్టాయి. తెలంగాణ స్వరాష్ట్ర చరిత్రలో ఒక కార్పొరేషన్ పీఠం మీద సీపీఐ జెండా ఎగురవేయడం ఇదే తొలిసారి. తొలి రెండున్నరేండ్లు సీపీఐ, మిగతా రెండున్నరేండ్లు కాంగ్రెస్ మేయర్, డిప్యూటీ మేయర్ పదవులను చేపట్టేలా రెండు పార్టీల మధ్య ఒప్పందం కుదిరింది.

## అభ్యర్థి మిస్సింగ్..!

ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో కౌన్సిలర్ మిస్సయ్యారు. దీంతో ఉద్రిక్తత ఏర్పడి.. చైర్ పర్సన్ ఎన్నిక వాయిదా పడింది. ఇక్కడ మొత్తం 24 వార్డుల్లో బీఆర్ఎస్ (13), కాంగ్రెస్(8) బీజేపీ(2), ఇండిపెండెంట్ (1) గెలుపొందాయి. బీఆర్ఎస్ కౌన్సిలర్ ఒకరు కనిపించకుండా పోవడంతో కలకలం చెలరేగింది.

## జగిత్యాలలో సంజయ్‌దే పై 'చేయి'



జగిత్యాల మున్సిపాలిటీలో ఎమ్మెల్యే సంజయ్ వర్గం పైచేయి సాధించింది. ఆయన టీమ్‌కే మున్సిపల్ చైర్‌పర్సన్ పీఠం దక్కింది. మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి వర్గానికి వైస్ చైర్ పర్సన్ పదవి వచ్చింది. జగిత్యాలలో కాంగ్రెస్‌కే ఆధిక్యం వచ్చినప్పటికీ.. సంజయ్, జీవన్ రెడ్డి మధ్య ఆధిపత్య పోరుతో చైర్‌పర్సన్ పీఠంపై ఉత్కంఠ కొనసాగింది. హైకమాండ్ రంగంలోకి దిగి ఇద్దరి మధ్య రాజీ కుదిర్చింది. సంజయ్ వర్గానికి చెందిన సమిండ్ల వాణికి చైర్‌పర్సన్, జీవన్ రెడ్డి వర్గానికి చెందిన పర్వీన్‌కు వైస్ చైర్‌పర్సన్ పదవి ఇచ్చారు. జగిత్యాలలో మొత్తం 50 వార్డులు ఉండగా.. కాంగ్రెస్ టికెట్ మీద 23 మంది, రెండు వర్గాల నుంచి 12 మంది ఇండిపెండెంట్లుగా గెలిచారు. మొత్తానికి 35 మంది మద్దతుతో కాంగ్రెస్ మున్సిపల్ పీఠం సొంతం చేసుకుంది.



## భార్య చైర్‌పర్సన్.. భర్త వైస్‌చైర్మన్

నిర్మల్ మున్సిపాలిటీలో చైర్‌పర్సన్, వైస్ చైర్ పర్సన్ పదవులు భార్యాభర్తలకే దక్కాయి. మున్సిపల్ చైర్‌పర్సన్‌గా అప్పాల కావ్య, వైస్ చైర్మన్‌గా ఆమె భర్త అప్పాల గణేశ్ చక్రవర్తి ఎన్నికయ్యారు. ఈ మున్సిపాలిటీలో మొత్తం సీట్లు 42. బీజేపీకి 13, కాంగ్రెస్ కు 24, ఎంఐఎంకు 3, బీఆర్ఎస్ 2 సీట్లు గెలిచాయి. కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన మెజారిటీని సాధించింది.

## కామారెడ్డిలో చేతిలోకి గులాబీ!

కామారెడ్డి మున్సిపాలిటీని కాంగ్రెస్ కైవసం చేసుకుంది. చైర్‌పర్సన్‌గా ఇప్ప ఉమారాణి, వైస్ చైర్‌పర్సన్‌గా గోదావరి ఎన్నికయ్యారు. ఇక్కడ మొత్తం 49 వార్డులు ఉండగా.. బీజేపీ 16, కాంగ్రెస్ 19, బీఆర్ఎస్ 11, ఇండిపెండెంట్లు ముగ్గురు గెలిచారు. స్వతంత్ర అభ్యర్థిగా గెలిచిన ఉమారాణి.. కాంగ్రెస్‌లో చేరారు. ఆమెకు కాంగ్రెస్, బీఆర్ఎస్, ఇండిపెండెంట్ కౌన్సిలర్లు ఓటేశారు. దీంతో మొత్తం బలం 33కు చేరుకున్నది. ఇక్కడ కాంగ్రెస్, బీఆర్ఎస్ కౌన్సిలర్లంతా ఒక్కటై బీజేపీకి షాక్ ఇచ్చారు.

**రాయికల్‌లోనూ..**

రాయికల్ మున్సిపాలిటీలో కాంగ్రెస్, బీఆర్ఎస్ దోస్తీ కట్టాయి. ఎన్నికల్లో బీజేపీకి 5, కాంగ్రెస్‌కు 3, బీఆర్ఎస్‌కు 3 సీట్లు రాగా.. ఇండిపెండెంట్ ఒక్కరు గెలిచారు. కాంగ్రెస్, ఇండిపెండెంట్ల మద్దతుతో బీఆర్ఎస్ నుంచి కట్కం రవీందర్ చైర్‌పర్సన్‌గా, తురగ సౌజన్య వైస్ చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు.

**అమరచింతలోనూ..**

అమరచింత మున్సిపాలిటీలో కాంగ్రెస్‌కు బీఆర్ఎస్ కౌన్సిలర్లు సపోర్ట్ చేశారు. మొత్తం 10 వార్డులు ఉండగా.. కాంగ్రెస్ (3) బీఆర్ఎస్ (3) బీజేపీ(3), సీపీఎం (1) గెలుపొందాయి. బీఆర్ఎస్‌కు చెందిన ఇద్దరు కౌన్సిలర్లు కాంగ్రెస్ కు సపోర్ట్ చేయడం.. సీపీఐ కౌన్సిలర్ మద్దతుతోనూ చైర్‌పర్సన్‌గా కాంగ్రెస్ కౌన్సిలర్ సువర్ణ, వైస్ చైర్‌పర్సన్‌గా రాధ ఎన్నికయ్యారు.




## ఆదిలాబాద్‌లో బీజేపీకి షాక్

ఆదిలాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్‌గా బండారి అనూష ఎన్నికయ్యారు. ఆమెకు కాంగ్రెస్ టికెట్ రాకపోవడంతో స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగి గెలిచారు. కాంగ్రెస్, ఎంఐఎం, బీఆర్ఎస్, స్వతంత్రుల మద్దతుతో చైర్‌పర్సన్ అయ్యారు. ఆదిలాబాద్‌లో మొత్తం 49 వార్డులకు గాను బీజేపీకి 21, కాంగ్రెస్‌కు 11, ఎంఐఎంకు 6, బీఆర్ఎస్‌కు 6, ఇండిపెండెంట్లు ఐదుగురు గెలిచారు. అతిపెద్ద పార్టీగా బీజేపీ అవతరించినప్పటికీ.. ఇతర పార్టీల మద్దతుతో అనూష చైర్‌పర్సన్ అయ్యారు.



## తొర్రూరులో హైటెన్షన్

మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మున్సిపాలిటీలో చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నిక సందర్భంగా తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. కాంగ్రెస్ ఎంపీ కడియం కావ్య ఎక్స్‌అఫీషియో ఓటుపై బీఆర్ఎస్ నేతలు అభ్యంతరం చెప్పడం, ఈ క్రమంలో ఇరువర్గాలు దాడి చేసుకోవడంతో ఎన్నిక వాయిదా పడింది. తొర్రూరులో 16 వార్డులు ఉండగా.. బీఆర్ఎస్ 9, కాంగ్రెస్ 7 గెలిచాయి. ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, ఎంపీ కావ్య ఎక్స్ అఫీషియో ఓట్లతో కాంగ్రెస్ బలం కూడా 9కి చేరింది. దీంతో మున్సిపల్ పీఠం కోసం రెండు పార్టీల మధ్య పోటీ ఏర్పడింది. సోమవారం ఎన్నిక సందర్భంగా బీఆర్ఎస్ నేత ఎర్రబెల్లి దయాకర్ రావు తమ పార్టీ కౌన్సిలర్లను తీసుకుని మున్సిపల్ ఆఫీసుకు వెళ్లారు. కావ్య గతంలోనే వరంగల్ కార్పొరేషన్‌లో ఎక్స్ అఫీషియో ఓటు నమోదు చేసుకున్నారని, అందువల్ల ఆమె ఓటు చెల్లదని అధికారులకు ఫిర్యాదు చేశారు. అదే టైమ్‌లో యశస్విని రెడ్డి తమ పార్టీ కౌన్సిలర్లను తీసుకుని మున్సిపల్ ఆఫీసుకు వచ్చారు. ఈ క్రమంలో ఇరువర్గాల కార్యకర్తలు దాడి చేసుకున్నారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో ఎస్పీ శబరీష్ సిబ్బందితో అక్కడికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు. చివరికి ఎన్నిక వాయిదా పడింది.

## కోరం లేక.. పోస్ట్‌పోన్

రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల్లో భాగంగా 11 మున్సి పాలిటీల్లో కోరం లేక వాయిదాపడ్డాయి. ఇందులో డోర్నకల్, ఇల్లందు, జనగామ, ఇబ్రహీంపట్నం, సుల్తానాబాద్, క్యాతనపల్లి, జహీరాబాద్, కాగజ్ నగర్, ఖానాపూర్, ఇంద్రేశం, తొర్రూరు ఉన్నాయి. మద్దతు ఇవ్వాలంటే.. చైర్ పర్సన్ పదవి తనకే ఇవ్వాలని ఓ కౌన్సిలర్ పట్టుబట్టడంతో జనగామ, ఎక్స్ అఫీషియో ఓట్ల వివాదం ఇంద్రేశం మున్సిపాలిటీల ఎన్నికను అధికారులు వాయిదా వేశారు.

## భైంసాలో తెగిన పతంగి

నిర్మల్ జిల్లా భైంసా మున్సిపాలిటీలో మజ్లిస్‌కు షాక్ తగిలింది. ఇండిపెండెంట్ అభ్యర్థులంతా కలిసి పాలక వర్గాన్ని ఏర్పాటు చేశారు. తుమోళ్ల దత్తాత్రి చైర్‌పర్సన్‌గా, కుతిజ సిద్దిఖీ వైస్ చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. ఈ మున్సిపాలిటీలో మొత్తం 26 వార్డులు. ఎంఐఎంకు 12, బీజేపీకి 6, కాంగ్రెస్‌కు 1, ఇండిపెండెంట్లు ఏడుగురు గెలిచారు. చైర్ పర్సన్ పదవి దక్కాలంటే 14 సీట్లు అవసరం. 12 సీట్లతో ఎంఐఎం అతిపెద్ద పార్టీగా అవతరించినా.. చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్ ఎన్నిక సమయానికి పార్టీల బలాబలాలు తలకిందులయ్యాయి. ఆరుగురు బీజేపీ కౌన్సిలర్లు, ఒక కాంగ్రెస్ అభ్యర్థి.. ఇండిపెండెట్లకు మద్దతు ప్రకటించారు. దీంతో మొత్తం బలం 14కు చేరుకున్నది. స్థానిక ఎమ్మెల్యే రామారావు పటేల్ తన ఎక్స్ అఫీషియో ఓటును వీరికి అనుకూలంగా వేయడంతో స్వతంత్రులు విజయం సాధించారు. ఇండిపెండెంట్లలో ఎక్కువ మంది బీజేపీ రెబల్సే.





## గెలిచిన అత్త.. ఓడిన కోడలు!

గద్వాల జిల్లా నారాయణపేట మున్సిపల్ చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్ సీట్లను బీజేపీ ఎంపీ డీకే అరుణ వర్గం దక్కించుకుంది. ఇక్కడ మొత్తం సీట్లు 24. ఇందులో కాంగ్రెస్ (7), బీజేపీ(11), ఎంఐఎం(1), బీఆర్ఎస్(1), ఇండిపెండెంట్లు (2) గెలిచారు. మ్యాజిక్ ఫిగర్ 13. చైర్ పర్సన్ పీఠం దక్కించుకునేందుకు మొదటి నుంచీ బీజేపీ, కాంగ్రెస్ పోటీ పడ్డాయి. ఇందుకోసం బీజేపీ ఎంపీ అరుణ, కాంగ్రెస్ స్థానిక ఎమ్మెల్యే పర్ణికారెడ్డి (డీకే అరుణకు మేనకోడలు) ఎన్నో ప్రయత్నాలు చేశారు. ఒక ఇండిపెండెంట్ బీజేపీలో చేరడం, ఎంపీగా అరుణకు ఎక్స్‌అఫీషియో ఓటు ఉండటంతో బీజేపీ బలం 13కు చేరింది. అరుణ మద్దతుతో బీజేపీ కౌన్సిలర్ శ్వేత యాదవ్ చైర్ పర్సన్ బరిలో నిలవగా.. పర్ణికారెడ్డి మద్దతుతో కాంగ్రెస్ కౌన్సిలర్ శ్వేతా గౌడ్ బరిలోకి దిగారు. బీఆర్ ఎస్ తటస్థంగా ఉండటంతో.. పీఠాన్ని బీజేపీ కైవసం చేసుకుంది. కోడలి మీద అత్త నెగ్గినట్టయింది.